# అంతులేని ఆచారాలు

అర్ధరాత్రి దాటిన రెండు గంటల వేళ, భూతప్రేత పిశాచగణాలు పరిభ్రమించే వేళ అని కొందరంటారు! జారులు చోరులు, జూదరులు తాగుబోతులకు అనుకూలమైన సమయమని కూడా కొందరంటూ వుంటారు!

ఆవేళప్పుడు కెవ్వున ఒక స్త్రీ గావుకేకలు–ఆ చీకటికి చిల్లులుపడి ఆ ప్రాంతాలు గింగురుమన్నాయ్! గాఢ నిద్రలో ఆ గావుకేకలను అకస్మాత్తుగా విన్న ఏ మానవ జాతి ప్రాణులైనా పంచ ప్రాణాలూ పైకి లేచినట్టు–మంచాల మీద పడుకున్నవారు ఎగ్గిరి కింద పడరని ఎవరనగలరు?

ఆ కేకలకు దాదాపు అంత ప్రమాదానికీ ఆ బెంచీ మీది వయసు మళ్ళిన దంపతుల ద్వయం గురి అయి వుండ వలసిందేగాని గత చరిత్రలో పెళ్ళిళ్ళయిన వారి అయిదుగురాడ గూతుళ్ళ పురుళ్ళకు యిలాంటి గావు కేకలవల్ల, వారి గుండెలు తరిఫీదు తినివుంటం వల్ల యివాళ అంత అర్ధరాత్రి వేళప్పుడైనా వారి కళ్ళల్లో ఆవేదన మటుకే కనుపించింది. వారి ఆరవకూతురు సుజాత – ప్రసవ పెనుగులాట తీవ్రదశకొచ్చిన సమయం అది. ఆ నర్సింగుహోములో...

అలా ఆవేదనకు గురి అయిన దంపతులు ఒకరు యిటీవలే రిటైరైన లెక్కల లెక్చరరు హరినారాయణ, రెండవ వారు ఆయన భార్య లక్ష్మీనర్సు.

"ఏవండీ, ఆ కేకలు మన సుజాతవా?" ఆవేదనతో అడిగింది భార్య, లక్ష్మీనర్సు.

"ఏమో, నీకెంతో నాకూ అంతే తెలుసు. మనుషుల గొంతుల్ని అన్ని స్థాయిల్లోనూ గుర్తించడం అసంభవం! అందులో ప్రసవ వేదనలప్పుడు మరీను!" అన్నాడు భర్త హరినారాయణ.

"బాధ అంటూ తెలిసిన వారెప్పుడైనా ఆ గొంతుల్ని గుర్తిస్తారా. మనం తప్పు! ఆ ఆపరేషన్ గదిలోంచి ఒక నర్సు బయటికొస్తున్నది. వెళ్ళి అడగనన్నా అడగండి విషయం తెలుస్తుంది."

"అడగచ్చు–కాని ఆవిడె ఆడనర్సే మరి! వాళ్ళతో చాలా పేచీలుంటయే నీకు తెలియదు. ఇది అసలు ఆడవాళ్ళ విషయం, నువెళ్ళి అడుగుతే ఆవిడె ఏదీ కాదనదు.

నాకు ముందు అనుభవంకూడా అంతగా లేదే మరి–”

“దొరక్క దొరక్క మీరే దొరకాలి యీ ఆడ నర్సులకు–” అంటూ విదిలించేసినట్టు అనేసి వెళ్ళి ఆపరేషను థియేటరులోంచి వస్తున్న నర్సును “ఏమమ్మా, ఆ అరుస్తున్నది మా అమ్మాయా? పురుడొచ్చిందా మా అమ్మాయికి? ఎంత గిలగిల్లాడ్తున్నదో మాపిల్ల?” అడిగింది లక్ష్మీనర్సు.

“పేరేమిటి?”

“సుజాత. రాత్రి పదిగంటలకే తీసుకెళ్ళారు లోపలికి–”

“లోపల నలుగురుకు నొప్పులొస్తున్నాయి. యిద్దరికి యింతకు ముందే పురుళ్ళొచ్చినై– ఒకరికి చిన్నాపరేషనూ, యింకోరికి పెద్దాపరేషనూ అయినాక– వుండండికాసేపు, మళ్ళీ వచ్చి చెపుతా.” వెళ్ళిపోయింది నర్సు.

“ఏమండీ, ఆ గదిలో నలుగురు తయారుగా వున్నారట! యిద్దరకు యిప్పుడే, ఒకరికి చిన్నాపరేషనూ, యింకోరికి పెద్దాపరనేషనూ అంట పురుళ్ళొచ్చినయ్యట! అందులో మనమ్మాయి ఎవరో ఎప్పటికండీ తెలిసేదీ?”

“నలుగురమ్మాయిలు వున్నారా? అస్సలు ఏ ఒక్కరి విషయం ఏ మోతాదులో పురుడొచ్చిందీ– పూర్వం గాని, వర్తమానంలో గాని చెప్పటం అస్సలు నాకు దుస్తరమైన విషయం! అవన్నీ కేవలం మీ ఆడవారికి తెలిసేలోతులు!”

“అవునవును లెక్కల పాండిత్యానికి మనిషి ప్రపంచం అంత దగ్గిరగా వుంటుందా మరి. అందులో మీ విషయం?”

“నేను కాదనను. కాలేజీల్లో లెక్చర్లు కొట్టుకునే ప్రతివాణ్ణీ తరుచు పురుళ్ళ వద్ద పడేస్తే వాళ్ళ పురుళ్ళ విజ్ఞానం అపారమవుతుందని నేను బల్ల గుద్ది వాదించగలను. మరి నా స్థితి, ఆ దశను అందుకోలేదే! నా మాట విని నువే ఆపరేషను గది బయట తిష్టవేస్తే ఎవరు ముందాగదిలోనుంచి బయటికొచ్చినా యీసారైనా మనకు కొంత భోగట్టా తొందరగా అందవచ్చు” అంటున్న భర్తను ఓ చూపు చూసి ఆపరేషను థియేటరు దగ్గిరకెళ్ళి నుంచున్న లక్ష్మీనర్సుకు ప్రతిఫలం వెంటనే ముట్టింది. పెద్దాపరేషను జరిగింది తమ కూతురు సుజాతకేనని, ఆడపిల్ల పుట్టి యిద్దరూ క్షేమంగా వున్నారనీ తెలిసి మురిసిపోయింది.

విషయం విపులంగా విన్న హరినారాయణ పూర్వం తనది “స్త్రీ సంతతి జాతకం” అని నిర్ధారణైవున్నా పెళ్ళిళ్ళయి వున్న తన ఆరుగురు కూతుళ్ళక్కూడా స్త్రీ సంతతి జాతకులుగానే వర్ధిల్లుతున్నారని యివాళ సొంతం రూఢి చేసుకోక తప్పలేదు. తన ఆఖరి పిల్ల సుజాతక్కూడా ప్రథమ కానుపు ఆడ సంతతి జాతకంతో ప్రారంభమైంది!

ఆ తెల్లవారుఝాము షుమారు అయిదుగంటలు దాటినాక త్యాగరాయ నగర్లో సొంతకొంప కొచ్చి చేరిన హరినారాయణ వంటింటో గ్యాసుస్టవు సహాయంతో కొంతా, అప్పుడే పాలవాడు పెట్టిపోయిన పాలపొట్లాలతో కొంతా, ఓ గ్లాసెడు కాఫీ పుట్టించి హాల్లో పడక్కుర్చీలో కూలపడ్డాడు నిట్టూరుస్తూ.

తన భార్య లక్ష్మీనర్సు యింకొంచెం సేపటికి నర్సింగుహోం నుండి యింటికి వస్తుంది. ఒచ్చి తీసివుంచిన కాఫీ తాగుతుంది. ఆ కాఫీ వస్త్రపూతమైన డికాషనుతో తయారైందని గ్రహించవచ్చు. తమ మధ్య కాఫీ తంతు కొంత నడిచినాక స్నానంచేసి, మధ్యాన్నానికి తమ ఇద్దరకూ వంటచేసి తనవాటా టేబిలు మీద ఆర్డర్లో పెట్టి మిగతాది తన సొంతానికి క్యారేజీలో పెట్టుకుని నర్సింగు హోముకు మళ్ళీ వెళ్తుంది యింటికి తనను కాపలాపెట్టి.

సరీగా నెలరోజుల కిందట తమ ఆఖరి కూతురు సుజాతకు తొమ్మిదోనెల వచ్చిందనీ, వుత్తరం అందిన మర్నాడు ఉదయం కలకత్తా మెయిల్లో మద్రాసు చేర్తున్నదనీ, తమను తప్పక స్టేషనుకు వచ్చి సుజాతను రిసీవ్ చేసుకోవలసిందనీ అమ్మాయి అత్తగారు వుత్తరం రాసింది.

ముందు ఆ కవరును "పోస్టు" అని ఒక కొత్త పోస్టుమను కిటికీలోంచి హాల్లో పడక్కుర్చీలో కూర్చున్న తనమీదగా గిరవాటేసి అర్జెంటుగా వెళ్ళిపోయినాడు, ఆ మాత్రం శ్రమే అక్కడికి ఎక్కువైపోయిందన్న వాలకంతో.

ఆ విసరబడిన కవరు తను కూచున్న చోటికి షుమారు రెండూముప్పాతిక మీటర్ల దూరంలో పడింది. బహుశ అతగాడు కొత్తగా అధికారంలోకొచ్చిన రాజకీయపార్టీ తాలుకు "న్యూవేవ్'8 పోస్టుమను అయి వుండవచ్చు. తను జాగ్రత్తగా 'కిర్' మంటున్న పడక్కుర్చీలోంచి లేచి ఒక పద్ధతిలో వచ్చిపడిన ఆ కవర్ను సేకరించి, మళ్ళీ 'కిర్' మన్న పడక్కుర్చీలోకొచ్చి కూచుని ఆ కవరు విషయాన్ని పరికిస్తుండగా "ఎక్కణ్ణుంచండీ వుత్తరం? మన పిల్లల దగ్గర్నుంచే వచ్చుంటుంది- ఏదీ ఒకసారి యిటివ్వండి చదివి యిస్తాను" అంటూ తన భార్య లక్ష్మీనర్సు హడావుడిగా వంటింటోంచి వూడిపడింది తడిచెయ్యి పమిటెకు తుడుచుకుంటూ.

"నువు వంటింటో వున్నావని దీన్ని నా మీదగా గిరవాటేసి పోయినాడా కొత్త పోస్టుమను! వుత్తరంమీద నా పేరు వుందిగదా అని యిప్పుడే చించి చదువుతున్నా."

"యింతలో మిమ్మల్నెవరేం చిన్నచూపు చూళ్ళేదు లెండి. పెణుక్కుంటున్నారప్పుడే! తెల్లవార్లేస్తే ఆ వంటింటో వార్చిపోయటాలు వుంటయిగదా విషయం తెలుసుకుని తొందరగా వెళ్దాం అనుకునొచ్చా అంతే. మీరుగానే చదివి చెవిన వెయ్యండి తరిస్తా" టపీమని పక్కనేవున్న స్టూలుమీద కూచుంది లక్ష్మీనర్సు.

"ముందు నువు వంటింటోంచి వస్తున్నావంటేనే ముచ్చెమటలు పోస్తయ్! అందుకే పాటించవలసిన అణుకువ నెప్పుడూ పాటించి పోతుంటా! మన ఆరోపిల్ల సుజాతకు తొమ్మిదో మాసం వచ్చి, రేపు ఉదయం కలకత్తా మెయిల్లో వస్తున్నదట- మనల్ని స్టేషనుకొచ్చి రిసీవ్ చేసుకోమని వియ్యపురాలు రాసింది."

"ఏమిటీ మన సుజీ బుజ్జికి తొమ్మిదో మాసం అప్పుడే వచ్చిందా! దానికి నెల తప్పటం గురించి ఎక్కడో రాసివుంచాను. సమయానికి జ్ఞాపకం వచ్చి అఘోరిస్తే యింకేం? చూశావా యింతమంది ఆడపిల్లల్తో ఎంత హడావుడిగా వుంటుందో? అబ్బ యీ సుజీ బుజ్జి నాన్నను చూడాలని యీ మధ్య నుంచి మనసెంత పీకుతున్నదో!"

"అలా పీకటం సహజంగా వుంటుంది మరి. అయిదుగురి ఆడపిల్లల పెళ్ళిళ్ళ తరవాత పెళ్ళయిన చిన్న బుజ్జాయెనే మరి?"

"చాల్లెండి- మన పిల్లలంటే మీ కుండే తీపే నాకూ వుంది. పెచ్చేమీ లేదు లెండి! అయినా ఆడపిల్లల విషయమంటే మీ ధోరణి యిటీవలనుంచి అదోరకంగా వుంటున్నదేం?"

"నా ధోరణి కేమిటే చరిత్రల్ని సృష్టించిందైతే! ఎంత తీపి కాకపోతే ఆరుగురు ఆడపిల్లలు తాలూకు పెళ్ళిళ్ళు, కట్నాలు, కానుకలు, ఆడబిడ్డల లాంఛనాలు, అలకపానుపులు, పండుగలు, పర్వాలు వగైరా వగైరాలు జన్మలక్కూడా సరిపడ శుభకార్య వగైరాలు యీ జన్మలోనే నడిపించటాలతో ముందు పుటకల్లో మన శుభకార్యాల పనులు బొత్తిగా తేలికై నిశ్చింతగా వుండవచ్చని నాకో నమ్మకం గట్టిపడింది సుమా!"

"పోనీలెండి పాపం. యీ రూపేణ అయినా మీ జన్మ తరించినట్టయింది! అయినా మీరు రిటైరైనప్పట్నుండీ చూస్తున్నా - మీకు బొత్తిగా పిచ్చివాగుడెక్కువైందేం? రిటైరవటమంటే మిమ్మల్ని ఓ రాచగద్దెమీదనుండి కిందికి లాగినట్టుగా అనిపిస్తున్నదా ఏమిటి ఖర్మ?"

"అది నూరుపాళ్ళ తెలివితక్కువ వాగుడంటాను. నేను యిటీవల రిటైరైనాక అలా బజార్లోకి ఎప్పుడు వెళ్ళినా, మీకేమండి హరినారాయణగారూ, మీ ప్రతిభంటే నిక్షేపంగా మీ అరుగురాడపిల్లల పెళ్ళిళ్ళు ముక్కుమీద వేలువేసుకునేట్టు అలా అవలీలగా జరిపించేసి చరిత్రలో మీ వంశానికో ప్రసిద్ధ స్థానం సృష్టించారు సుమా? అని ఎందరో పెద్దలు నాతో ఎంతో గౌరవంగా, నేను రిటైరైనాక రోజూ నాతో మాటాడటం తీరిగ్గా నేననుభవిస్తున్న అపూర్వ ఆనందం! యివన్నీ నీకెలా తెలుస్తయి చెప్పు?"

"చచ్చినా తెలియవు-తెలుస్తున్నా తెలియనట్టు పడుంటయ్ సరేనా? యిహ యిప్పటికైనా మాట్లాడుకుందామా, సుజాత రేపు కలకత్తా మెయిలుకు రావటం గురించి, కాస్త పెందరాడే లేచి సెంట్రలు స్టేషనుకు వెళ్ళిరండి."

"కలకత్తా మెయిలు యీ మంచు గడ్డల్లే గడ్డ కట్టుకుపోయే చలి ఋతువులో, ఉదయం నాలుగు గంటల పది నిముషాలకే-ఒక్కోసారి యింకొంచెం ముందుగా కూడా సెంట్రలు స్టేషనుకు వచ్చి చేర్తుందని బహుశ నీకు తెలియకపోవచ్చు. అంటే యీ మన త్యాగరాయనగరు నుండి సెంట్రలు స్టేషనుకు ఎన్ని గంటలకు లేచి, ఎలా అక్కడకు చలిలో పిడచ గట్టుకుపోయి చేరాలో - బస్సులు నడవని వేళగూడాను. అప్పటి నా స్థితి ఎలా వుండగలదోకూడా నువూహించలేవు!"

"వూహించను - యిష్టపడను! పెందరాడే మన మెయిను రోడ్డుకు వెళ్తే అక్కడ నా తలవెంట్రుకలన్ని టాక్సీలు వుంటయ్. పావుగంటలో సెంట్రలు స్టేషనుకు చేర్తారు."

"యివాళ పెట్రోల్తో నడిచే టాక్సీ బళ్ళ గురించి నువంత చులకన చేసి మాట్లాడటం అవివేకమైన విషయం! నన్ను చల్లో టాక్సీ కోసం ఒణుకుతూ రావటం కనిపెట్టిన ఏ టాక్సీ డ్రయివరైనా నిలువున నా వస్త్రాలొలిచి ఆవురావురమంటూ తినేస్తాడు."

ఆ మర్నాడు ఉదయం మూడు గంటలకే తను తలకు మఫ్లరూ, ఛాతీకి స్వెట్టరూ బిగించి ఆ చలిలో మెయిన్ రోడ్డుకు చేరి, అక్కడ ముందు అందుబాట్లో వున్న టాక్సీ ఫ్రంటు సీట్లో డ్రయివింగు చక్రం మీద వాలివున్న డ్రయివరును నిదానంగా పరీక్షించాడు.

తను యిటీవల చాలా హీనంగా ద్వేషించే వారి జాబితా ముందు పంక్తిలో కనబడేది వారి వృత్తిలో టాక్సీ డ్రయివర్లే! యీ టాక్సీ డ్రయివరు అలా డ్రయివింగు చక్రం మీదకు వాలివున్నది శ్రమకు అలిసి నిద్రకు తట్టుకోలేకనా లేక ఆ చలిలో తను టాక్సీ కోసం రావటం పసిగట్టి తనను నిలువున తింటానికి నటనా ముద్రలో నిద్రనభియిస్తున్నాడా అని అనుకొంటుండంగానే చక్రం మీద పెద్దగా ఆవలించాడు టాక్సీ డ్రయివరు.

"నాయనా డ్రయివరు బాబూ, సెంట్రల్ స్టేషనుకు వెళ్ళాలి. అవకాశం వుంటుందా?" దిగువస్థాయిలో అడిగాడు తను. యీ మధ్య టాక్సీలు ఎక్కకూడదని ఒకటికి రెండుసార్లు తను శపథం చేసినా కాలం తనకు కలిసి రాకపోయనే మరి?

"వుడనే ఎల్దాం-లోన కూస్కోండి బాబుగారూ" అన్నాడతగాడు స్వభాష, పరభాషలను పోషిస్తూ.

"తెల్లవారు ఝామునే మనకు జగడం వద్దు. నీ టాక్సీ రేటు విషయంలో ఉభయులం సౌమ్యంగా నడుచుకుందాం. ఏమంటా?"

"బాబుగారు నిండా మంచివారు. కూస్కోండి బాబూ పోదాం."

సెంట్రలు స్టేషనుకు చేరినాక టాక్సీ డ్రయివరు లెక్కల ప్రకారం-టాక్సీ రేటు,

యివాల్టి పెట్రోలు రేటు, జిల్లుమనివుండ చలిరేటు, నిద్రవేళ కష్టం రేటు మొత్తం యిరవై రూపాయల చిల్లరవుతే ఒక చేత్తో నోరు మూసుకుని, మరొక చేత్తో చిల్లరలేని అపరాధంతో చేర్చి యిరవైరెండు రూపాయలు– అతగాడికిచ్చి వూరుకున్నాడు తను.

సెంట్రలు స్టేషనులోనికి తను కాలు పెట్టగానే అక్కడి నోటిసులో కొట్టొచ్చినట్టు ముందు తన కళ్ళపడ్డది" కలకత్తా మెయిలు గంటన్నర లేటు" అని.

అసలు యీ గంటన్నర లేటుగావస్తున్న టైమే వెనక కలకత్తా మెయిలు సెంట్రలు స్టేషనుకు వచ్చి చేర్తున్న ఒరిజినల్ టైము! కాని యివాల్టి కొత్త రాజకీయపార్టీ ప్రభుత్వం రాకపోకలు మార్చటమైన దాన్ని ప్రకటించినట్టు పేపర్లు రాసినై!

ప్లాట్‌ఫారం మీద ఓ పక్కగా వున్న బెంచీ మీద తలపాగా శాలువ కప్పుక్కూచుని కళ్ళద్దాలగుండా చూస్తున్న ఒక వ్యక్తి పక్కన తను కూచుంటానికి చోటు లభించటం ఏడుపులో ఎడం చెయ్యి ఆడిందన్నట్టు, యీ విచారకాండలో తనకొక వరం ప్రసాదించి నట్టయింది.

"నమస్కారం హరినారాయణగారూ, మీరు యిటీవలే రిటైరైనారని తెలిసి యిప్పటికైనా మించింది లేదని తీరిగ్గా మీ సముఖానికికొచ్చి పరిచయం చేసుకుందామని అనుకుంటుండగా ఆ శుభ ఘడియలు యిలా కలిసిరావటం కేవలం నా అదృష్టం! నేను మీ విద్యార్థి తండ్రి నాగభూషణాన్ని. పూర్వం విజయవాడలో ప్లీడర్ని, నా తత్వానికి ప్లీడరీ ఆర్జన సరిపడక యిక్కడ యిరవై ఏళ్ళ కిందట ప్రెస్సు పెట్టుకున్నా. ప్రెస్సు జీవితాన్ని వంచనకు దూరంచేసి ప్లీడరు దగా బతుక్కు తగుమాత్రం ఎడం ఏర్పర్చుకోగలిగా" అన్నాడు నాగభూషణం, తన పరిచయం గురించి అట్టే యిబ్బంది పెట్టకుండా!

"మీ పరిచయ భాగ్యం కలిగినందుకు చాలా సంతోషిస్తున్నా. మా పిల్ల సుజాత కలకత్తా మెయిలు కొస్తుంటే రిసీవ్ చేసుకుంటానికొచ్చా."

"మా రెండో పిల్ల జ్యోతి కూడా యీ కలకత్తా మెయిలుకే వస్తున్నట్టు రాసింది. అది రమ్మని రాయకపోయినా నేనే స్టేషనుకొచ్చా. మీ సుజాత అంటే ఏడాదిక్రితం పెళ్ళయిన మీ ఆఖరు ఆరో అమ్మాయిగదూ? మీరు అదృష్ట జాతకులు! లక్షణంగా మీ ఆరుగురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు ఎలాంటి ఆర్థిక ఆటంకాలు లేకుండా వారందరి శుభకార్యాలు కన్నుల పండుగ్గా జరిపించి మీ జీవితాన్ని ఓ ఒడ్డుకు చేర్చుకోగలిగారు! అది అందరకూ అబ్బే అదృష్టంకాదు. తమ ఆడపిల్లల పెళ్ళిళ్ళకు అధోగతి పాలైన కొందరు పెద్దల చాటు కథలు తెలుసుంటంవల్ల మీ ఘనతను ప్రత్యేకంగా చూడగలుగుతున్నాగాని మీరు మరో విధంగా భావించవద్దని మనవి."

"ఒక్కోసారి అల్పసంతోషాలు కూడా మనం తలపెట్టిన శుభకార్యాలకు

జేగంటల్లాగా వినిపిస్తయి నాగభూషణంగారూ. మనం తలపెట్టిందెప్పుడూ మన మంచి కోసమేనని అనుకునేవాడు అదృష్టజీవే మరి. అలాగే మన సంప్రదాయాల్ని గురించి అనుకోవటం కూడా!" అన్నాడు తను.

"చాలా లోతుగా అన్నారు! కాని సంప్రదాయాలనేవి మనం ఏర్పర్చుకొన్న అలవాట్లే సుమండీ. ఆ అలవాట్లు మనకు గిట్టనప్పుడు ఒదిలించుకోవటంలో దోషగుణం వుండదు. కాని ఆ సంప్రదాయాలనేవి న్యాయచట్టాల్లాగానూ, దైవసంకల్పాలుగానూ పరిగణనలోకి వచ్చినై. పెళ్ళిళ్ళు యీ తెగకు చెందినవే. పెళ్ళి స్త్రీ పురుషుల జీవితానికి చెందిన కలయికగా బహిరంగంగా తెలిపే చట్టబద్ధం లాంటి ఒక చర్య. కాని మన ప్రస్తుత సంప్రదాయం యీ పెళ్ళిచర్యను కట్నబద్ధమైన చర్యగా చేసేసింది. యీ పద్ధతి నాకు గిట్టలేదు మరి."

"మీ పద్ధతికి అడ్డురాను" అన్నాడు తను.

"నేను నలుగురు ఆడపిల్లల తండ్రిని. వాళ్ళకు కట్నబద్ధంకాని పెళ్ళిళ్ళు చేశాను. సంప్రదాయక సభల్లో కొందరు పెద్దలు నా పిల్లల పెళ్ళిళ్ళు కేవలం ఆటవిక చర్యగా ప్రకటించారు!"

"మీ పిల్లలకు వర్ణాంతర వివాహాలు చేశారా– క్షమించండి కొంచెం సూటిగా అడుగుతున్నందుకు?"

"చంపేశారు! యీ వర్ణాలనే మాట నే నెప్పుడో మరిచానే! ఆ ప్రసక్తి వస్తే తడుముకోవలసి వస్తున్నది! నా యిద్దరాడపిల్లలు కాలేజీల్లో చదువుతూనో వుద్యోగాలు చేస్తూనో అదే తరగతికి చెందిన యువకుల యిష్టానుసారం పెళ్ళి చేసుకుంటే, మిగతా యిద్దరాడపిల్లలు తమ చదువులప్పుడు తమ అభిరుచులు సంస్కారాల్ని పాటించే యువకుల్తో పరిచయమై వార్ని పెళ్ళి చేసుకున్నారు. కట్నబద్ధ, వర్ణబద్ధ పెళ్ళిళ్ళకు వ్యతిరేకంగా! పూర్వం మనకు అలవాట్లో వుండే కొన్ని సంప్రదాయాల్ని స్వల్ప మార్పుల్తో యీనాడూ మనవోసాధనంగా వాడుకుంటున్నాం. మన గత చరిత్రలో అంగడి వస్తువులల్లే బజార్లలో ఆడ, మగవారు డబ్బుకు బానిసలుగా అమ్ముడుపోతే యీనాడు పెళ్ళిళ్ళ పేరిట ఒక్క ఆడదిమటుకే పురుషుడి సమ్మతానికి తనుగా ఎదురు డబ్బిచ్చి బానిసగా అమ్ముడుపోవటం జాగ్రత్త పరుచుకుంటున్నాం అని మా పిల్లలంటున్నారు!" అన్నాడు నాగభూషణం.

"మీరు నాటకాల్లో వేషాలేసే ప్రవేశం వుందా?" అడిగాడు తను.

"అబ్బే, అటువేపు తొంగిచూసే అవకాశం కలిగింది కాదు జీవితంలో. ఏమిటి, వింతగా అడుగుతున్నారు?"

"అడిగేశాను మరి– క్షమించండి. మీరు యిప్పుడు నాతో మాట్లాడిన విషయాలు

ఒక ధోరణిలో అచ్చంగా రంగస్థలంమీద కొందరు సాంఘిక పాత్రధారులు అనే ఫక్కీలో వున్నట్టనిపించి అడిగాను. వేరువిధంగా అనుకోకండి."

"అబ్బే, ఆ విషయం మీరు మరిచిపోండి. మీ కళ్ళముందర యధాతథంగా కనుపించేదాన్నే నిజమని పరిగణించే స్వభావం మీది!"

కలకత్తా మెయిలు ప్లాట్‌ఫారం మీద కొచ్చేదాకా తనూ నాగభూషణం మాట్లాడుకుంటూనే వున్నారు. కాని అందులో కొన్ని విషయాలు యివాల్టిక్కూడా తనను తొలుస్తూనే వున్నయ్.

రైలు ప్లాట్‌ఫార మీద ఆగినాక కంపార్టుమెంటులోంచి దిగి తనవేపే చూస్తున్న కూతురు సుజాతను చూసి, కొన్ని క్షణాలు స్తబ్దుడై నిలబడ్డాడు తను. ఆ నిండు గర్భంతో ఎదురుగా నుంచున్న తన కూతురు సుజాత తనకెందుకో కడుపులో కెలుకుతూ కనిపించిందేమిటి? ఆటలు, పాటలు, గంతుల్తో ఒకప్పుడు కళకళ్ళాడిన తన కూతురు ఆ వేళ తన కళ్ళకు ఒక అసహాయురాలైన ఆడదిగా కనుపించిందెందుకో?

"ఏమండోయ్, తలుపు తియ్యండి. లేచివున్నారా నిద్రబోతున్నారా– తియ్యండి తలుపు–" అంటూ గబగబ తలుపు కొట్టింది. నర్సింగుహోం నుండి వచ్చిన హరినారాయణ భార్య లక్ష్మీనర్సు.

తొమ్మిదో నెలలో పుట్టింటికి పురుడుకొచ్చిన సుజాత పదోనెలలో ప్రసవించింది. తొల్చూరు కాన్పు అవటంవల్ల పెద్ద ఆపరేషనుకు గురైన సుజాత పసిపిల్లతో పదోరోజునగాని పుట్టింటికి చేరలేదు. పురిటి నీళ్ళయినాక పొరుగిళ్ళ ఆడజనం తల్లి, పిల్లను చూసేందుకు హరినారాయణ యింటిమీద దాడిచేశారు గీగామంటూ. అమ్మలక్కల అచ్చట్లు ముచ్చట్లకు పొంగిపోయిన లక్ష్మీనర్సు భర్త హరినారాయణ వంటయింటో ఓ పక్కనుంటం గమనించి తనూ అక్కడకుచేరి, సుజాతవద్ద ఆడంగుల సందడి గురించి చెపుతూ భర్తచేతిలో కాగితాలేవో వుంటం చూసి "ఏమిటో చదువుకుంటున్నట్టున్నారు?" అంది.

"ఆస్పత్రి బిల్లులు, యితర బిల్లులు అలమర్లో కనుపించినై."

"అవును, సుజాత యింటికొచ్చేప్పుడే నర్సింగుహోంవారు బిల్లులిచ్చారు. అన్నీ అలమర్లో కలిపిపెట్టా, పురిటినీళ్ళయినాక చూసుకోవచ్చని."

"ఫరవాలేదు. యిలాంటివి కొంచెం తాపీగా చూసుకోవచ్చు. ఆపరేషనుకు ఎనస్తీషియనుకు, ఆపరేషను థియేటరుకు, పోస్టు ఆపరేషను థియేటరుకు, పోస్టు ఆపరేషను గదికి, మందులు, బాండేజి వగైరాలకు, పదిరోజులు సుజాత గది అద్దెకు, నర్సులకు పనివాళ్ళకు మామూళ్ళు, పసిపిల్లకు డ్రాప్సు, రబ్బరు గుడ్డలు, ప్లాస్టిక్ కవరున్న పల్చటి ఫోము పరుపు, చిన్న దిళ్ళు, బేబీ సబ్బు, బేబీ పౌడరు, బేబీ పాలడబ్బా, బేబీ పాలసీసా,

బేబీ పాలపీకలు, బోరిక్ పౌడరు మొత్తం రెండున్నరవేల చిల్లర. సుజాత కాన్పుకు ముందు రక్తక్షీణతకు యింజెక్షన్లు, టానిక్కులు, పళ్ళకు ఓ రెండు వందలు, కాబోయే బారసాలకు షుమారు ఓ అయిదువందల చిల్లర కలుపుకుంటే మూడువేల చిల్లర అయినట్టు" అన్నాడు హరినారాయణ గోడకానుకుని, యింటి కప్పువేపు చూస్తూ.

"ముందు ఆడపిల్లల పురుళ్ళక్కూడా కుడిఎడంగా యిన్ని కర్చులవుతూ వచ్చినైగా, యివాళ అంత దీర్ఘంగా జాబితాలు విడమర్చి చదవటమెందుకు?" అంది లక్ష్మీనర్సు దీర్ఘంతీస్తూ.

"ఆడపిల్లల తండ్రికి కాస్త వెనుకముందులుంటయి మరి! మనం ఆరుగురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు వగైరా భేషుగ్గా జరిపించామని అన్నిసార్లు వింటం ఒక ఎత్తవుతే యీ అభిప్రాయాల వెనక యింకోరి కంటికి కనబడకుండా - అగోచరంగా మన సొమ్ము తాలూకు అసలు జాతకం ఏ రకంగా నడిచింది యింకో ఎత్తు! యీ విషయం నువంత గమనించేది కాదు. మన ఆరుగురు ఆడపిల్లల పదిహేను ఏళ్ళు జరిగిన పెళ్ళిళ్ళ తంతులో కట్నాలు, లాంఛనాలు, అలకలకు ఘనంగా ముట్టచెప్పటం, కొత్తకాపరాలకు వార్ని దగ్గరుండి తీసుకువెళ్ళి దింపటం, తిరిగి వార్ని పురుళ్ళకు పుట్టింటికి తేవటం, పురుళ్లు, బారసాల తదనంతరం సంతాన సహితంగా వార్ని అత్తగారింట్లో దింపిరావటం, పండగలు, పర్వాలకు సత్కరించటం వగైరా వగైరాలకు నా వుద్యోగ ఆధారం వల్లనూ, ట్యూషన్లవల్లనూ ఖర్చు పెట్టింది పెద్దూరాగా రిటైరైనాక ప్రావిడెంటు ఫండు, గ్రాట్యుటీ తాలుకు సొమ్ముతో పేరుకున్న అప్పులు వడ్డీతో చేర్చి సర్దింది సర్దగా వెరసి దిగపడ్డ సొమ్ము మొత్తం అప్పు పాతికవేలు, ప్రస్తుతం పురిటికాన్పు కాక!" అన్నాడు హరినారాయణ, శూన్యంలోకి చూస్తూ.

"దారుణం! అన్యాయం! మన కుటుంబ వ్యవహారాలు మెళుకువతో నడుపుకోవటం మీ వల్ల కాలేదు!"

"మెళకువతోనే క్రమాన్ని తప్పించలేదు మనం. మన ఆచార ధర్మాల్నీ, సత్సంప్రదాయాల్నీ 'తుచ' తప్పకుండా సమాజ పెద్దలయొక్కా, మనయొక్కా ఆమోద ముద్రలతో యధావిధిగా నడుపుకున్న చరిత్ర మనది. యివాళ కాదనలేము. అలాగే శుభకార్యాల తంతులో గౌరవం, హోదాల తాలుకు ముడికూడా అట్టిపెట్టుకోవటం మనం కాదనకూడదు. కాని, యివాళ అంత లక్షణంగానూ మెప్పులతోనూ జరిపించిన మన పిల్లల పెళ్ళిళ్ళ తంతుగురించీ,.వాళ్ళకు మనం యిచ్చిన రక్ష గురించీ తలుచుకుంటే పీడ కలలొస్తున్నాయ్! నెల రోజుల కిందట సెంట్రలు స్టేషన్లో నిండుగర్భంతో వున్న మన సుజాతను చూస్తే భయం వేసింది. ఎందుకో! దానికి పెద్దాపరేషన్ అనగానే నా ఒంటికి ముచ్చెమటలు పట్టినై! ఒకప్పుడు మన పిల్లల శుభకార్యాలకు మురిసిపోయిన తత్వం

అందుకు విరుద్ధంగా యివాళ తిరగపడ్తున్నది! ప్రస్తుతం మనకు మిగిలిన అదృష్టం యీ యిల్లు మన కష్టార్జితం కావటం! దీని అసలు అవసరం యిప్పుడున్నంతగా ముందేనాడూ లేదని నా మనస్సు పీకుతున్నది!" అన్నాడు హరినారాయణ నేలవేపు చూస్తూ.

అప్రయత్నంగా చెమ్మగిల్లిన కళ్ళతో "చూశారా, ఎప్పట్నుంచో మీకు కాఫీ యివ్వాలనుకున్నదాన్ని, నా బుద్ధి బుగ్గయినట్టే వుంది" అంటూ గ్యాసుస్టవు వైపు తిరిగింది లక్ష్మీనర్సు భర్త నుండి మొహం తప్పిస్తూ.

బారసాల యధావిధిగా జరిగి హరినారాయణ మనవరాలి పేరు సుగంధి ఖాయమైంది. సుజాతకు మూడోమాసం వచ్చి యివాళ రాత్రికి అత్తగారింటికి వెళ్ళే రోజయింది. ఆ సాయంకాలం హాలుతలుపు బార్లగా తెరిచి వుండి ఓపక్కగా మనుమరాలు ఒంటరిగా పడుకుంటం గమనించిన హరినారాయణ, ఒక్కసారి స్తబ్ధుడై–ఎవరో బలవంతాన తన రెండు గూళ్ళూ పట్టుకు ఆపినట్టు నిలబడి పొయ్యాడు.

"వూఁ" అంది మనుమరాలు సుగంధి తాతను చూసి. వెంటనే మనమరాలి పక్కన కూచుని రెండు బుగ్గలూ ఒత్తాడు హరినారాయణ.

"వూఁ" మళ్ళీ అంది సుగంధి సొట్ట బుగ్గల్తో నవ్వుతూ.

"తన మనుమరాలి మొహం ఎంత కళగావుంది?" ఒంగి పిల్లను ముద్దు పెట్టుకుంటున్న హరినారాయణ వెనక–

"ఏమిటీ నాన్నోయ్, యిన్నాళ్ళకు నీ మనుమరాలు కనిపించినట్టుందే? నీ కోసం నా కడుపున మొగపిల్లవాడు పుట్టాలని వెయ్యి దణ్ణాలు పెట్టుకున్నా, ప్రయోజనం లేకపోయింది! చివరకు నా జాతకం కూడా ఆడ సంతతి జాతకమే అయింది!" అంది తండ్రి వెనుకనొచ్చి నుంచున్న సుజాత.

"ఓసి పిచ్చిదానా, సృష్టిలోనూ, మన సమాజంలోనూ ఆడ మగల అవసరం సమానమే! కాని మన దృష్టి చూస్తున్నదీ మనం అలవాటు చేసుకున్నదీ వేరుఁ చూడు, నా మనుమరాలు ఏమంటున్నదో? ఆడ, మగ విలువలు సమానమని తన ఆమోద ముద్ర వేస్తూ "వూఁ" అని ఎలా అంటూ నవ్వుతున్నదో?" నిండిన నవ్వు మొహంతో అన్నాడు హరినారాయణ.